క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేస్తున్న విజయలక్ష్మి

యాడికి: పంచాయతీ నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టారు. యాడికి మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనులు చేయకుండా నకిలీ బిల్లులు తయారు చేసిన వారితో పాటు ఆమోదించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి విజయలక్ష్మి అప్పటి ఫిర్యాదుదారులతో పాటు పంచాయతీ ఈఓ అశ్వర్థ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర, సర్పంచు అనురాధ సమావేశమై నిధులు దుర్వినియోగంపై ఆరా తీశారు. పంచాయతీ రికార్డులు పరిశీలించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపాతామని విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎండీఓ శశికళ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడులో ఉన్న మోడల్‌స్కూల్‌లో శుక్రవారం సంకల్ప్ కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ సాజిదాబేగం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ తదితరులు మహిళా సాధికారత, రక్షణ, సంక్షేమ వంటి కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలను వివరించారు. అలాగే పోక్సో చట్టం, హెల్త్ అండ్ న్యూట్రిషన్, స్కిల్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమాదేవి, రామలక్ష్మి, లక్ష్మీదేవి, అంగన్‌వాడీకార్యకర్తలు శంకరమ్మ, ముంతాజ్, సురేఖ, లలిత, లక్ష్మీకాంతమ్మ, హైమావతి, పర్వీన్, తేజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న సీహెచ్‌సీ కౌన్సిలర్ వెంకటపతి

శింగనమల: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపవద్దని శింగనమల సీహెచ్‌సీ కౌన్సిలర్ వెంకటపతి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ , నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శింగనమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హెచ్‌ఐవీ ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయ, డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.కవిత, లెక్చరర్లు సుప్రియ, చంద్రశేఖర్, ఎలిజిబెత్, గౌస్య భాను, శ్యామల, సతీష్‌కుమార్, హాజీపీరా, చాంద్‌బాషా, వర్కర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక వసతులు కల్పించండి'

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రామిరెడ్డి కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ ఆరోపించారు. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిన కాలనీలోని అధ్వాన్నమైన పరిస్థితిని న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలవుతున్నా నేటికీ సీసీ రోడ్డు వేయించలేని దుస్థితి నెలకొందన్నారు. మున్సిపల్ అధికారులు కాలనీని సందర్శించి రోడ్డును వేయించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని సురేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిలాన్, సత్తార్, ఆశాబీ, మాబున్నీ, రామ్‌దాస్ పాల్గొన్నారు.

ఏకాంగేశ్వరస్వామీ.. నమోస్తుతే



ఏకాంగేశ్వరుడి మూల విరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న తెన్మటం వంశస్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చింతరపల్లిలో శుక్రవారం అవధూత ఏకాంగేశ్వరస్వామి ఆరాధనోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మఠం పర్యవేక్షులైన తెన్మటం వంశస్తులు శ్రీనివాసాచార్యులు, సుదర్శనాచార్యులు, సత్యనారాయణ చార్యులు ఆనవాయితీలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనార్థం తిమ్మనచెరువు, పెద్దపప్పూరు, చిన్నపప్పూరు, నరసాపురం, కుమ్మెత, యాడికి తదితర ప్రాంతాలనుంచి వందలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వచ్చిన భక్తులు స్వామి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రహదారులు అస్తవ్యస్తం



గుంతకల్లులో ప్యాచ్ వర్క్ కోసం రోడ్డు తవ్వేయడంతో వ్యాపారాలు లేక క బోసిపోయిన సోఫియా స్ట్రీట్



గుత్తిలో రహదారి గుంతలమయమవడంతో అదుపు తప్పి బోల్తా పడిన ద్విచక్ర వాహనం

- గుంతకల్లులో ఇష్టారాజ్యంగా ప్యాచ్ వర్కులు
- గుత్తిలో గుంతల రోడ్లలో తరచూ ప్రమాదాలు

గుంతకల్లుటౌన్: అభివృద్ధి పనులు చేస్తే ప్రజలంతా మెచ్చుకునేలా ఉండాలి. కానీ ఆ పనులు పూర్తి చేయించడానికి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజలు, చిరు వ్యాపారులు తిట్టుకుంటున్నారు. పట్టణంలోని గుంతబావి వీధి, సోఫియా స్ట్రీట్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు కోసం కొన్ని నెలల క్రితం గుంతలు తవ్వి ప్యాచ్ వర్కులు చేయించకుండా మట్టితో పూడ్చారు. మళ్లీ ఇప్పుడు ప్యాచ్ వర్కులు షురూ చేశారు. అయితే ఈ మూడు రోడ్లలో మీటర్ల పొడవునా గుంతలు తవ్వడంతో వాహనాల రాకపోకలన్నీ నిలిచిపోయాయి. దీంతో ఆయా రోడ్లకిరువైపులా ఉన్న దుకాణదారులు మాత్రం వ్యాపారాలు జరగక తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన చెందుతున్నారు. గతంలో పైప్‌లైన్ ఏర్పాటు సమయంలో 20 రోజులు ఇబ్బందులు పడ్డామని, మళ్లీ ప్యాచ్ వర్కులు పూర్తి చేయడానికి 10 రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దసరా పండుగ సమీపిస్తున్న వేళ తమను ఇబ్బందులు గురిచేయకుండా వెంటనే రోడ్డు ప్యాచ్ పనులు పూర్తి చేయించాలని ఆయా ఏరియాల్లోని వ్యాపారులు కోరుతున్నారు.

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డు గుంతలమయమైంది. రోడ్డు అధ్వానంగా ఉండటంతో గుంతలో చక్రం ఇరుక్కుని శుక్రవారం గుత్తిలో భారీ లారీ మొరాయించింది. అంతే కాకుండా గుంతకల్ రోడ్డులోనే మరో ప్రాంతంలో బైక్ అదుపు తప్పి గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో దంపతులు తిరుపాల్, సుశీలమ్మ స్వల్పంగా గాయపడ్డారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. రోడ్డు చాలా దారుణంగా ఉండటం వల్లే తరుచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు, ట్రాఫిక్ జామ్ అవుతోందని పట్టణ వాసులు వాపోయారు. రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



పుట్లూరులో డీటీకి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డేనియల్, నాయకులు



గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



పామిడిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పుట్లూరు/పామిడి/గార్లదిన్నె: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డేనియల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పుట్లూరు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతి పత్రం అందించి తమ డిమాండ్లను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, అసిస్టెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో దశల వారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సుభాన్, కిషోర్, ఓబులేసు, కృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలో ఏర్పాటు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సమావేశంలో ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ బి.వెంకటరమణ, పామిడి మండల అధ్యక్షుడు ఎస్ నూర్‌మహమ్మద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు, బీ సుంకప్ప, ఎస్ వివేకానంద, డీ కుళ్ళాయప్ప, రామాంజనేయులు, ఉజ్జీనప్ప, మన్సూర్‌అలీ, మహేష్, వీర నారాయణస్వామి, కృష్ణయ్య, సన్యాసప్పుడు, జాకీర్‌హుశేన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదిర్శి సిరాజుద్దీన్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్‌వలి, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప ,గార్లదిన్నె మండల అధ్యక్షుడు పర్వతయ్య, ప్రధాన కార్యదర్శి మహేష్, రంగనాయకులు, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ వైపు 'కూటమి' మొగ్గు



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: విద్య, వైద్యం ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వైద్య విద్య అందని ద్రాక్షల తయారైందన్నారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని 10 వైద్య కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తే విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి మరింత ఇబ్బందులు పడుతారన్నారు. పేద విద్యార్థులు సైతం వైద్య విద్యను అభ్యసించేలా ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విజయవాడ, విశాఖపట్నం ఆర్టీసీ డిపోలకు చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను లూనా కంపెనీలకు దారధత్తం చేస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీలు, పరిశ్రమలులను ప్రైవేటీకరణ చేస్తూ ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ఆదర్శంగా తీసుకుంటున్నాడని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లోగా కులగణన చేపట్టి... ఆ ప్రతిపాదికన బీసీలకు సీట్ల రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయా, బీసీ కులాల సంఘాల నేతలతో ఈ నెల 14న విజయవాడలో సమావేశం ఏర్పాటు చేశామని, సమావేశంలో కులగణన రిజర్వేషన్లపై భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, మురళీకృష్ణ, రామురాయల్, రామాంజనేయులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



గుంతకల్లులో బాలల పరిరక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బాలల హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి సూచించారు. మండలంలోని నెలగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, ప్రభుత్వ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిచిత వ్యక్తులు, ఫేస్‌బుక్, ట్విట్టర్ స్నేహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఫోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

యల్లనూరు: బాల్యవివాహాలు నేరమని యల్లనూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజామణి తెలిపారు. శుక్రవారం చిలమకూరు ఏపీ మోడల్ స్కూల్‌లోని విద్యార్థినులకు చట్టాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేష్, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, అచ్యుతాపురం , చిలమకూరు అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం కాశీరాణి, ఆశా రామేశ్వరి పాల్గొన్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి



జయచంద్ర మృతదేహాన్ని పరిశీలిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు

యాడికి: ఫిట్స్ రావడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని కుంటలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని రామస్వామి వీధికి చెందిన పెద్ద నాగరాజు కుమారుడు జయ చంద్ర(28) గత కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ ఏ పని లేకుండా తిరుగుతుండేవాడు. శుక్రవారం సాయంత్రం కుంటలో నడచుకుంటు వెళ్తుండగా ఫిట్స్ రావటంతో జయచంద్ర కుప్పకూలి కింద పడి మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న హెడ్ కానిస్టేబుల్ విచారణ చేపట్టారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

బుక్కరాయసముద్రం: ఆర్డీటీ కార్యకలాపాలను కొనసాగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, దళిత సంఘం నాయకులు వెంకటేష్, నారాయణ ,నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఫాదర్ ఫెర్రర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి ఆర్డీటీ ఎంతో కృషి చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీ కార్యకలాపాలు కొనసాగేలా ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయా లని డిమాండ్ చేశారు. కార్యమంలో రాజు, కుళ్లాయప్ప, నాగరాజు, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో భారీ వర్షం



గుత్తి చెరువు నిండి మరువ పారుతున్న దృశ్యం

గుత్తి: గుత్తిలో గురువారం అర్ధరాత్రి, తిరిగి శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 27.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా వరుసగా కుండపోత వర్షం కురవడంతో గుత్తి చెరువు నిండి మరువ పారింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పామిడి: పామిడిలో మూడురోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్ల గుంతలు వర్షపునీటిమయమైయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. వీధులు చిత్తడిమయమైయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు

గుత్తి: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసి ఓ నెంబర్(9100986901) అందుబాటులో ఉంచామని కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. పాత ఇళ్లలో ఎవరూ నివాసముండదన్నారు. సురక్షితంగా ఉండే ఇళ్లలోకి మారాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

దోమల నివారణకు చర్యలు



యల్లనూరులో గంబూషియా చేపలు వదులుతున్న వైద్యుడు లోకేష్‌కుమార్

యల్లనూరు/యాడికి : వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందకుండా యల్లనూరు జెడ్పీ హైస్కూల్, ఎస్‌కే కాల్వ రోడ్డు, ఆస్పత్రి పరిసరాల్లో దోమలు, దోమలార్వాలు వ్యాప్తి కాకుండా వైద్యుడు లోకేష్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు ప్రబలకుండా గంబూషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, ఏఎన్‌ఎం సోమలత, ఆశా వర్కర్ రమాదేవి పాల్గొన్నారు. అలాగే యాడికి మండలంలోని తిప్పారెడ్డిపల్లిలోని నీటి కుంటల్లో మెడికల్ ఆఫీసర్ డా పరమేశ్వర్ , తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు గంబూషియా చేపలు వదిలారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేల్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నానో యూరియాతో అధిక దిగుబడి



కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయాధికారులు

పుట్లూరు: సాంప్రదాయ యూరియా స్థానంలో నానో యూరియాను వినియోగించడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకురాలు హేమావతి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని శనగలగూడూరు, తక్కళ్లపల్లి రైతు సేవా కేంద్రాల్లో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. యూరియాను ఎక్కువగా వినియోగించరాదని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వినియోగించడం వల్ల నేల కలుషితం కాకుండా ఉంటుందన్నారు. నానో యూరియా అర లీటర్‌ను ఎకరాకు వాడుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ కాత్యాయని, ఏఈఓ చిన్ననాగిరెడ్డి, వీహెచ్‌ఏ, వీఏఏలు రాజ్యలక్ష్మి, సావిత్రి, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

గజ్జ వస్త్రాలంకరణలో బుగ్గ రామలింగేశ్వరస్వామి



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి గజ్జ వస్త్ర అలంకరణ చేశామని ప్రధాన అర్చకుడు రవిస్వామి తెలిపారు. భాద్రపద పంచమిని పురస్కరించుకుని పంచామృతాభిషేకాల అనంతరం భక్తులకు స్వామి వారు గజ్జ వస్త్రాలంకరణతో దర్శనమిచ్చారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రిటౌన్: పట్టణ సమీపంలో ఉన్న 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తాడిపత్రి పట్టణం, పరిసర గ్రామాలు, యాడికి మండలంలోని గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీలు ప్రభాకర్‌రావు, వసంతయ్య తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

'జెడ్‌ఈడీ'పై అవగాహన

యాడికి: చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జెడ్‌ఈడీ (జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్) ధ్రువీకరణ పథకంపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో విశాలాక్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సేవా సంస్థ ప్రతినిధి గణేష్ మాట్లాడుతూ జెడ్‌ఈడీ ధ్రువీకరణ మూడు స్థాయిల్లో ఉంటుందన్నారు. ధ్రువీకరణ పొందిన వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, రాయితీలు, బ్యాంకు లోన్లు సులభతరంగా లభిస్తాయన్నారు. ధ్రువీకరణ పత్రం కోసం 9966484146,9959621615 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేష్, షెక్షావలి పాల్గొన్నారు.

విద్యార్థుల ఐడీ కార్డుల అందజేత

శింగనమల: మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు ఫొటో గుర్తింపు కార్డులను శుక్రవారం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు అందజేశారు. హిందీ ఉపాధ్యాయురాలు అనుసూయ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టారని హెచ్‌ఎం హరినాథ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో శుక్రవారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.4,650 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉరుసు పోస్టర్ల విడుదల



హజరత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదనీ ఉరుసు పోస్టర్ల విడుదల దృశ్యం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలోని హజరత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదనీ ఉరుసు పోస్టర్లను శుక్రవారం ఆ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ నెల 14,15 తేదీల్లో ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు హాజరు కావాలన్నారు.

'ర్యాలీ జయప్రదం చేయండి'

పామిడి: పేదల పెన్నిధి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణలో జాప్యాన్ని నిరసిస్తూ ఈ సోమవారం ఉదయం 10 గంటలకు ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ కమిటీ శుక్రవారం పేర్కొంది. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ర్యాలీకి ఆర్డీటీ లబ్ధిదారులు, మహిళా కమిటీలు, అన్నివర్గాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

'ఏచూరి' ఆశయ సాధనకు కృషి

గుంతకల్లుటౌన్/పామిడి: బడుగు, బలహీన వర్గాల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి అసువులు బాసిన ఏచూరి సీతారామ్ ఆశయాల సాధనకు పాటుపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి అన్నారు. శుక్రవారం గుంతకల్లులోని సీపీఎం కార్యాలయంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగ్గిలి రమేష్, సురేంద్ర, వై.శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, రంగమ్మ, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలంలోని కడవకల్లు వైఎస్సార్ సర్కిల్ వద్ద శుక్రవారం సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి సూరి, నాయకులు పెద్దయ్య, ఆదినారాయణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట ఉరుసు ప్రారంభం

గుత్తి: గుత్తి కోటలో సయ్యద్ హజరత్ 678వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గంధం వేడుకలు నిర్వహించారు. శనివారం ఉరుసు, ఆదివారం జియారత్ నిర్వహిస్తామని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తరలివచ్చి ఉరుసును జయప్రదం చేయాలని వారు కోరారు.

విద్యుత్ కేబుల్ చోరీ

యల్లనూరు: మండలంలోని గడ్డంవారిపల్లి, వెన్నపూసపల్లి, యల్లనూరు, మల్లాగుండ్ల, దంతలపల్లి తదితర గ్రామాల్లోని తోటల్లో మోటార్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసుకున్న కేబుల్ చోరీకి గురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేబుల్ చోరీ ముఠా బృందం సభ్యులు పగటిపూట పొలాల్లో సంచరిస్తూ రాత్రి పూట రైతులు లేని సమయంలో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. గడ్డంవారిపల్లికి చెందిన ఓ రైతు పొలంలో రూ.40 వేలు విలువ చేసే కేబుల్ వైరు చోరీ చేశారన్నారు. యల్లనూరు, తిమ్మంపల్లి, సింహాద్రిపురం తదితర ప్రాంతాల్లోని గుజిరి వ్యాపారులతో ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి సమావేశం ఏర్పాటు చేసి కేబుల్ చోరీలపై విచారణ చేపట్టాలన్నారు.